# 9. మానని గాయాలు

వారం రోజులనుంచీ పోలీసులు ఊరంతా చాలా జాగర్తగా గస్తీ తిరుగుతున్నారు. దొంగతనాలు కొంతవరకూ తగ్గినవి కాని, పూర్తిగా జరగటంలేదని మాత్రం చెప్పేందుకు వీలు లేకుండా వుంది.

చిమ్మ చీకట్లో నడుస్తున్నాడు రామస్వామి, కానిస్టేబిల్‌గా మూడు సంవత్సరాల సర్వీసే అయినా అతనెంతో ధైర్యంగలవాడు. న్యాయంకోసం పోరాడేందుకు అతనెప్పుడూ వెనుకంజ వేయలేదు. లంచాల వ్యవహారమంతా అతనికి బొత్తిగా గిట్టదు. ముక్కుకు సూటిగాపోతే కాస్త ఆలస్యంగానైనా తన సామర్థ్యతను అధికారులు గ్రహిస్తారనే ఆశ అతన్ని వొదలలేదు. చిన్నతనంనుంచీ అతని జీవితాన్ని ధర్మమార్గంలోనే గడిపేందుకు బాగా అలవాటు పడ్డాడు. చదువు అతనికి అంటేదేమోకాని సంసారపు బరువును లాగవలసి రావటంవల్ల చదువుసంధ్యల్ని అతను చాలా చిన్నతనంలోనే వొదులుకోవలసి వొచ్చింది. యీ ఉద్యోగంలో ప్రవేశించినప్పటి నుంచీ అతను ఉదరపోషణ తోడుగా దేశానికీ, ప్రజలకూ కొంత సేవను కూడా చేయగలుగుతున్నాననే సంతృప్తినికూడా అనుభవించ గలుగుతున్నాడు.

గత నాలుగురాత్రులనుంచీ కన్ను మూయకుండా యీ విధంగానే వీధివీధి నడుస్తూనే ఉన్నాడు. ఎదురైన వ్యక్తులందర్నీ పరామర్శిస్తూ, అనుమానం వున్నవాళ్ళను శల్య పరీక్ష చేస్తూ రాత్రులు గడుపుతున్నాడు. చీకటి, ఒంటరితనం, భయం, ఇవేమీ అతని మనసులో పనిచేయటం లేదు. ధర్మ రక్షణ అనే ధైర్యం తన విధి. ఇవే అతనికి తోడునీడలుగా వుండి ముందంజ వేసేందుకు ఒక అద్భుతశక్తిని అతనిలో రేకెత్తింప జేస్తున్నవి.

నడుస్తూన్న వాడల్లా చప్పున ఆగాడు. అంతవరకూ అతనిలో కలిగిన మార్గాయాసం, శ్రమ మొదలైన వన్నీ మాయమైనవి. ఒక కొత్త శక్తి ఏదో ప్రవేశించినట్టయింది. ఎంతో జాగర్తగా, ఉషార్‌గా అతను గమనించసాగాడు. చీకట్లోకి దృష్టిని నిగిడ్చి అతి జాగర్తగా పరిశీలించాడు...

ఎవరో వ్యక్తి సందుమూల వున్న మునిసిపల్ చెత్తకుండీ పక్కనే కూర్చొని మూటకడుతున్నాడు. నల్లగా తుమ్మ మొద్దల్లే బలంగానే వున్నట్టున్నాడు. ముఖకళలు చెప్పటం కష్టంకాని, ఆకారం మాత్రం కదలికలో తెలుసుకోదగ్గదిగా వుంది. వాడు బహుశా తనను చూసి వుండడు. వాడి ఆతృతలో వాడి భయంలో గమనించవలసినంతగా ఏ విషయాన్నీ గమనించలేకపోయి ఉండొచ్చు.

ఇక మూటతీసుకొని పరుగెత్తటమే తరువాయిగా తోచింది రామస్వామికి. వొక్క క్షణం ఆలస్యం చేశాడా అంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. వెంటనే పరుగెత్తుకు వెళ్ళి వాడి చెయ్యి పట్టుకున్నాడు. వాడు కూడా తప్పించుకొని పారిపొయ్యేందుకు పెనుగులాడాడు. కాని లాభం లేకపోయింది.

"ఎవరు నువ్వు?" అన్నాడు రామస్వామి. వాడేమీ మాట్లాడలేదు.

"యీ మూట ఏమిటీ?"

దీనికీ జవాబులేదు. మూటపట్టుకు చూశాడు. బరువుగా ఉంది..లోనిది బంగారం అయి ఉండొచ్చని గ్రహించాడు.

"సరే... స్టేషన్‌కు పా-"

వాడు భోరున కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు. పెద్దగా ఏడుస్తే నలుగురూ పోగవుతారని వాడి భయమేమో-

"మీకో వంద నవరసులు ఇస్తాను. నన్ను వొదిలెయ్యండి" అని వాడు దీనంగా బతిమాలుకుంటున్నాడు.

ఇది దొంగసొమ్మనేది నిర్ధారణ అయిపోయింది. లేకుంటే వాడు వంద నవరసుల్ని తనకెందుకు ధర్మంగా ఇస్తాడు? వంద నవరసులు!

"వీల్లేదు...పా-స్టేషన్‌కు" అన్నాడు రామస్వామి.

"నన్ను పట్టుకుంటే మీకేం లాభం? నాకు శిక్షవేస్తారు. మీకొచ్చే దేమీ ఉండదు. ఇందులో ఐదొందల నవరసులు ఉన్నయ్. మీరు రెండొందలు తీసుకొని నన్ను వొదిలెయ్యండి..." వాడు బేరం ఏదో విధంగా త్వరగా - లేదు - వెంటనే ఫైసలై పొయ్యేందుకు ఆతృతగా జాలిగా దీనంగా వేడుకుంటున్నాడు. ఆలస్యమైతే శ్రమ అంతా వృథా అనే భావన, నీ మేలు, నీ లాభం కూడా వుంది ఆలోచించుకో అనే హెచ్చరిక వాడి ధోరణిలో స్పష్టంగా కనిపిస్తూవుంది.

రామస్వామి కాస్త ఆలోచనలో పడ్డాడు. ఇంతవరకూ అతని సర్వీసులో లంచం తీసుకొని ఎరుగడు. కాని తనతోటి వాళ్ళు లంచం తీసుకోవటం, వాళ్ళ సంసారాలు హాయిగా కాలంగడపటం తను ఎరుగు. తన జీవితమంతా కష్టపడ్డా రెండువందల నవరసులు సంపాయించలేదు! ఇది లంచమే అయినా ఇచ్చినవాడు ఎక్కడా చెప్పడు. తీసుకున్నవాడు అంతకు మునుపే జాగర్తపడతాడు. ఆ విధంగా తన సత్ప్రవర్తన కాపాడబడుతుంది....కాని మళ్ళీ ఆలోచించాడు. ఇది దొంగ సొమ్ము. ఇప్పుడు వీణ్ని నేరస్థుడుగా తనెలా పట్టుకున్నాడో, తననుకూడా ఇంకోరు అదేవిధంగా పట్టుకోవచ్చు. అదీగాక లంచాలు తీసుకొని న్యాయానికి విరుద్ధంగా నడిచేవాళ్ళను తను దుమ్మెత్తి పోస్తుండేవాడు యీవరకు. తను లొంగాడా ఇక జీవితంలో అతను లంచగొండితనాన్ని సమర్థించి తీరాల్సిందే కాని తన కింకో గతిలేదు. లోపల వొకటీ పైకొకటిగా సంచరించగలిగే కళ అతనికి అలవాటు లేదు. అంతరాత్మ పెట్టే బాధకు అతను తట్టుకోలేడు...క్షణంలో ఇదంతా నీచ మనిపించింది. తన సత్ప్రవర్తనకు ఇదొక గీటురాయిగా తోచింది. లంచం తీసుకోవట మనేదాన్ని గూర్చి తనకు కాస్త ఆశకలగటాన్ని నిందించుకున్నాడు. తనకు తను 'ఛీ' అనుకోవటం అతనికిది మొదటిసారి!

"అదేం వల్లకాదు. నువ్వు మొత్తం మూట నాకిచ్చినా అక్కర్లేదు. ముందు స్టేషన్‌కు నడు–" అని వాణ్ణి బలంగా ముందుకు నెట్టాడు.

నేరస్థుడికి బాగా అర్థమైపోయింది. ఇక వీడితో బేరాలు లాభంలేదని, సౌమ్యంగా గొడవలేకుండా బాధలేకుండా తప్పుకుపొయ్యేమార్గం తనకు అందని దూరంలో వుందని వాడికి తెలిసిపోయింది. ఇంకొక్కటే – చివ్వరిమార్గం – తను యీ ఉచ్చులోంచి దూసుకుపోగలిగింది–వాడి బుర్రలో మెరిసింది. అవసరంకొద్దీ యీ మెరుపులు రాకపోతే వాడి వ్యాపారం సాగేందుకు ఏ విధమైన అవకాశమూ లేదు!

రామస్వామి చేతి పట్టును విడిపించు కునేందుకు గుంజుకో సాగాడు. పెనుగులాటలో ఎప్పుడు తీశాడో చిన్న చాకుతీసి రామస్వామిని పొడిచాడు. అదృష్టవశాత్తు రామస్వామి చేయి అడ్డంపెట్టబట్టి సరిపోయిందికాని, లేకుంటే అతని పొట్టలో దిగబడవలసింది.

దెబ్బతినగానే రామస్వామి యీలవేశాడు. ఆ చుట్టుపక్కల ఎక్కడైనా పోలీసుశాఖకు సంబంధించిన వాళ్ళుంటే తనకు సహాయంగా రమ్మనే ఆ ఆర్తనాదానికి జవాబుకూడా వొచ్చింది. చివరిసారిగా దొంగ పెనుగులాడాడు. రామస్వామి ఆ చేతి మీదనే ఇంకో కత్తిపోటుకూడా తిన్నాక కాని సబ్‌ఇన్‌స్పెక్టర్ ఇంకో పోలీసుతో వాణ్ని బంధించటం జరిగింది కాదు.

"నీ చేతి మీద రక్తం?" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"కత్తితో పొడిచాడు."

వాణ్ని తలానాలుగూ తన్నారు.

"మూడొందల ముప్పై! రామస్వామిని ముందు హాస్పటల్‌కు తీసుకుపో. నేను వీణ్ని స్టేషన్‌కు లాక్కుపోతాను-"

"వాడి దగ్గర నవరసులు ఉన్నాయ్ - జాగర్తచేయండి" అన్నాడు రామస్వామి.

కత్తికూడా వున్నట్టుంది వెధవ దగ్గర అన్నాడు మూడొందల ముప్పై.

"నా దగ్గర రివాల్వర్ వుందిలే" అన్నాడు ఇన్‌స్పెక్టర్ వాడిదగ్గరున్న మూటనూ కత్తినీ లాక్కొని జాగర్త పరుస్తూ.

మూడొందల ముప్పై రామస్వామిని హాస్పటల్ వైపు నడిపించుకొని వెళ్లాడు.

## 2

రామస్వామికి తగిలిన చాకుపోట్లు పెద్దవనే చెప్పాలి. రాత్రంతా బాధతో మూలుగుతూనే ఉన్నాడు. ఉదయానికి కొంచెం తగ్గినట్టుగావుంది. తనెంతో పెద్దకేస్ పట్టాననీ, అధికారులందరూ తనను మెచ్చుకుంటారనీ, డ్యూటీలో ప్రాణాన్ని కూడా తెగించినందుకుగాను తనకు పెద్ద ప్రమోషన్ వొస్తుందనీ అతను ఆనందపడుతూ సగం బాధను మరిచిపోగలిగాడు.

సాయంత్రానికి మూడొందల ముప్పై వొచ్చాడు.

"ఏమైందీ?" అన్నాడు రామస్వామి.

"వాడికి ఒక నెల శిక్ష వేశాడు."

"ఒక్క నెలేనా? రెండు సెక్షన్లకిందా?"

"అంతే. వెధవ ఐదు సవర్ల దొంగతనం అదీ పెద్ద దొంగతనమని ఎట్లా?"

"ఏమన్నావూ? ఐదు సవర్లా?"

"ఐదు హస్తం ఒక సెక్షన్ నిలవనేలేదు. రెండో సెక్షన్ కింద, డ్యూటీలో వున్న నిన్ను పొడిచిందాని కింద నెల రోజులు శిక్ష అంతే!"

"ఆ మూటలో ఐదు సవర్లేనా?"

"అంతే! వెధవ కేసుజోలికి పొయ్యావ్" అని రహస్యంగా "అందులో రెండో మూడో పుచ్చుకొని వొదిలేసినా ఈ కత్తిపోట్లన్నా తప్పేవి" అన్నాడు.

రామస్వామికి మతిపోయినట్లయింది. ఐదు వందల నవరసులల్లా, తెల్లారేప్పటికి సున్నాలు హరించుకు పోవటంతో చిదంబర రహస్యం అతనికి అర్థమైంది.

"ఇన్‌స్పెక్టర్ నీకో ఇరవైరూపాయిల రివార్డుకు రాశాడులే. పదన్నా వొస్తుంది. టీపార్టీ చెయ్యాలి సుమా!"

రామస్వామికి మండిపోతోంది. న్యాయం ఎంత బాగా ఉద్ధరించ బడుతోందో తనచేతిమీది గాయాల తాలూకు మచ్చల్ని తను చూడగలిగినంత కాలమూ అతను మరిచిపోలేడు. తన ఉద్యోగమూ, నీతి, సత్ప్రవర్తనా వీటన్నిటికీ అర్థం ఏమిటో అతనికి ఇప్పుడు నిజంగా అర్థమైంది.

మూడొందల ముప్పైగాడు ఏమేమిటో వాగుతున్నాడు. "ఇన్‌స్పెక్టర్‌కు పెద్ద రివార్డు కూడా వొస్తుం దనుకుంటున్నారు" అంటున్నాడు.

ఆ రివార్డేదో రాత్రే ముట్టిందని చెప్దామనుకున్నాడు రామస్వామి. కాని చెప్పి ప్రయోజనం లేదనీ, తన బతుకంతా న్యాయంమీదకాక, ఇన్‌స్పెక్టర్ మీదనే ఆధారపడి వుందనీ జ్ఞాపకం వొచ్చి ఊరుకున్నాడు. అతనికి ఆంతరంగికమైన బాధ భరించలేనంత ఐంది.

"అబ్బ!" అన్నాడు మూలుగుతూ.

"గాయాలు ఇంకా బాధగా వున్నయ్యా?"

"అవి మానవు...ఎప్పటికీ మానవు!" అని వెక్కి వెక్కి ఏడ్వసాగాడు రామస్వామి.

– *జనవరి, 1949*